భగభగలతో ఉక్కిరిబిక్కిరి

- భానుడి ఉగ్రరూపం.. అల్లాడుతున్న జనం
- ప్రతిరోజూ 40 డిగ్రీల పైనే ఉష్ణోగ్రత
- ఉక్కపోత.. తీవ్రంగా వడగాల్పులు
- ఉదయం పది గంటలకే నిర్మానుష్యంగా రోడ్లు



శావల్యాపురం: భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక వైపు ఉక్కపోత, మరో వైపు వడగాలులు ధాటికి ప్రజలు ఇంటిలో నుంచి ఉదయం 9 గంటల తర్వాత బయటకు రావాలంటే భయపడుతున్నారు. 10 గంటల కల్లా రోడ్లన్నీ బోసిపోతున్నాయి. ప్రతిరోజూ 40 డిగ్రీల పైనే నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలాటే ఉంటే రాబోయే రోజుల్లో రోహిణీ కార్తె ప్రారంభం అయితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రతతో శీతలపానీయాలతో పాటు ఫ్రూట్ జ్యూస్‌లు, కొబ్బరిబొండాలు, పుచ్చకాయ, మజ్జిగ, నిమ్మకాయ సోడాలు అమ్మకాలు పెరిగాయి. ప్రజలు వీటిని సేవిస్తూ కాస్తంత ఉపశమనం పొందుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చిన్నారులు, వృద్ధులు పొలాల్లో పనులు చేసే కూలీలు జాగ్రత్తలు పాటించాలి. అధికంగా తాగునీరు తీసుకోవాలి. బయటకు వెళ్లే వారే వెంట మంచి నీటి బాటిల్ తప్పక తీసుకెళ్లాలి.
- ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లకపోవడమే మంచిది.
- తప్పనిసరి పరిస్థితిల్లో బయటకు వెళ్లేవారు కాటన్ దుస్తులు, తలకు కండువా లేదా టోపీ ధరించాలి.
- మాంసాహారం, నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలు మితంగా తీసుకోవాలి.



శావల్యాపురంలో కొబ్బరిబొండాల దుకాణం

అల్లాడుతున్నాం..



ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. ఉదయం 10 గంటలు దాటితే బయటకు వచ్చే పరిస్థితి లేదు. గత ఏడాది కంటే ఈఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. విపరీతమైన ఎండల ధాటికి ఇప్పుడే అల్లాడిపోతున్నాం. ఇంకా పెరిగితే మరిన్ని ఇబ్బందులు తప్పవు.

– పి.ఏడుకొండలు, శావల్యాపురం

జాగ్రత్తలు తీసుకోవాలి..



వేసవిలో ప్రతి ఒక్కరు వయస్సుతో నిమిత్తం లేకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. శరీరంలో నీటి శాతం తగ్గిపోయి వివిధ రకాల వ్యాధులకు గురవుతారు. రోజుకు కనీసం 5 లీటర్లు మంచినీరు తాగాలి. నిస్సత్తువగా అనిపించినప్పుడు గ్లూకోజ్ ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. దీనిద్వారా శరీరంలో శక్తి పెరుగుతుంది. వడదెబ్బకు గురైనవారు ఆలస్యం చేయకుండా స్థానిక వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకోవాలి.

– ఎం.రాధాకృష్ణన్, మండల ప్రాథమిక వైద్యాధికారి, శావల్యాపురం

క్లుప్తంగా

సనా వెల్ఫేర్ సొసైటీ సేవలు ఎనలేనివి



చిలకలూరిపేట: సనా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సేవలు విలువైనవని పలువురు ముస్లిం నాయకులు కొనియాడారు. సొసైటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం బాలుర ఉచిత సామూహిక ఖత్నా (వడుగులు) కార్యక్రమం ఆదివారం పట్టణంలోని షాలు బుడే ముస్లిం షాదీఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సనా సంస్థ అధ్యక్షుడు మొహమ్మద్ యూసుఫ్‌ఆలీ ధార్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. 150 బాలురకు ఖత్నా నిర్వహించి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ముఫ్తీ అనస్‌ఖాన్, షేక్ నజీర్ అహమ్మద్, సయ్యద్ బషీర్ మేస్త్రి, కాగజి ఫారుక్, మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, కరిముల్లా, పఠాన్ జాఫర్‌ఖాన్, మౌలానా అబ్బాస్‌ఖాన్, సనా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

178 మందికి కంటి వైద్య పరీక్షలు



నాదెండ్ల: గణపవరం గ్రామీణ గ్రంథాలయంలో ఆదివారం నరసరావుపేట డాక్టర్ ఎంవీ రెడ్డి ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 178 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వివేకానందరెడ్డి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. వీరిలో 64 మందికి శుక్లాలు, కంటిలో పొరలు ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స చేసేందుకు ఆసుపత్రికి రిఫర్ చేశారు. మరికొందరికి కళ్లజోళ్లు రిఫర్ చేశారు. శుక్లాలు, పొరలు ఉన్న వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని పీఆర్ఓ దిలీప్ తెలిపారు. సోమవారం నుంచి తమ సొంత వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ల అనంతరం తిరిగి వారి ఇళ్ల వద్దకు చేరుస్తామని తెలిపారు.

నేడు చందలూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల: సాతులూరు సబ్‌స్టేషన్‌లో ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం చందవరం గ్రామానికి విద్యుత్‌సరఫరా నిలిచిపోనుందని ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్‌సరఫరా నిలిపి వేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామం ఎస్టీ కాలనీవాసులపై ఈనెల 19న దాడులు చేసిన సంఘటనపై ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం పట్ల నిరసనగా నేడు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట దళిత గిరిజన ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు రాష్ట్ర కుల నిర్మూలన పోరాట సమితి కార్యదర్శి కూరపాటి కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి సత్వరమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దుకాణాలు కూల్చివేసిన పొక్లయిన్‌లను సీజ్ చేయాలన్నారు.

30 లోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ రాయితీ

వినుకొండ: ప్రభుత్వ ఆదేశాలకు మేరకు 2025–26 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు ఈ నెల 30వ తేదీ లోపు ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీలో రాయితీ ఇవ్వబడుతుందని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఖాళీ స్థలం పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ తగ్గింపు, ఇంటి పన్ను చెల్లించిన వారికి 5 శాతం పన్ను తగ్గింపు ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వరిగడ్డి వాములు దహనం

మాచవరం: మండలంలోని మల్లవోలు గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వరిగడ్డి వాములు తగలబెట్టిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ చుక్కా సువార్త, ఆమె కుమారుడు రాజారావు పశువులకు మేత నిమిత్తం 8 ఎకరాల వరిగడ్డిని కొనుగోలు చేసి వాములు వేశారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాములకు నిప్పు అంటించడంతో మంటలు చెలరేగాయి. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే వాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రక్కనే ఉన్న ఎరువు దిబ్బలు కూడా తగలబడిపోయాయి. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

క్రీస్తు బోధనలు ఆచరణలో పెట్టినవారే నిజమైన విశ్వాసులు



ముగింపు సభలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ అనిల్‌కుమార్

- పాస్టర్ డాక్టర్ కేవీ వసురాజు
- ముగిసిన సువార్త సభలు

చిలకలూరిపేట టౌన్: ఏసుక్రీస్తు వాక్యాలను వినడమే కాదు వాటిని ఆచరణలో పెట్టినవారే నిజమైన విశ్వాసులని, వారు సత్యమార్గంలో జీవిస్తున్న వారు అని పాస్టర్ డాక్టర్ కేవీ వసురాజు పేర్కొన్నారు. పట్టణంలోని సాంబశివనగర్ చర్చి రోడ్డులో సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజుల పాటు సువార్త సభలు జరిగాయి. సువార్త కూటముల ముగింపు సభలో డాక్టర్ కేవీ వసురాజు ఆత్మీయ సందేశాన్ని ఇచ్చారు. బైబిల్‌ను పట్టుకోవడం అంటే దేవుని చేయి పట్టుకుని పరిశుద్ధ పరచబడి జీవితంలో పయనిస్తున్నామనే విషయాన్ని విశ్వాసులు గుర్తెరగాలన్నారు. అనంతరం చర్చి పాస్టర్ అనిల్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సువార్త కూడికలకు సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది దైవ సేవకులు, విశ్వాసులు హాజరయ్యారు.



సందేశం అందిస్తున్న డాక్టర్ కేవీ వసురాజు

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానం



కవి కమలారామ్

వినుకొండ: శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఆధ్వర్యంలో మే 10,11వ తేదీల్లో ఏలూరు పట్టణంలో జరిగే ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు, సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి, జాషువా సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షుడు, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్ ఆహ్వానం అందుకున్నారు. ఈ సందర్భంగా కమలారామ్‌ను పట్టణ ప్రముఖులు, కవులు అభినందించారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు

నూజెండ్ల: మండల పరిధిలో పేద విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్, ఎయిడెడ్ పాఠశాలలో ఉచిత విద్య ప్రవేశానికి నేటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యాహక్కు చట్టం ప్రకారం స్థానిక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 25 శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలను కేటాయించవల్సి ఉందన్నారు. ఇందులో 10 శాతం ఎస్సీ, 4 శాతం ఎస్టీ, హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు 5 శాతం, బలహీన, మైనార్టీ వర్గాలకు 6 శాతం రిజర్వేషను అమలు చేయటం జరుగుతుందన్నారు. ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ, రేషన్‌కార్డ్, పాస్ పోర్టు సైజ్ ఫొటోతో సమీపంలోని సచివాలయంలో గానీ, మండల విద్యాశాఖ కార్యాలయంలో మే 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని రవిచంద్ర తెలిపారు.

యడ్లపాడులో వైద్యశిబిరం

యడ్లపాడు: ఆహార అలవాట్ల మార్పుతో షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచగలమని ప్రముఖ వైద్యుడు లింగమల్లు మోహన్‌భాస్కర్ చెప్పారు. బాసట సామాజిక, సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ముందుగా రోగులకు షుగర్, బీపీ వ్యాధులపై అవగాహన, నియంత్రణకు చేయాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం శిబిరంలో లింగమల్లు మోహన్ భాస్కర్, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ పాల్గొని 230 మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్యసేవలు అందించారు. అనంతరం రెండు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. బాసట సభ్యులు నూతలపాటి కాళిదాసు, స్వామినేని శ్రీనివాస్, కేత రామబ్రహ్మం, ముత్తవరపు రవీంద్ర, వేణుగోపాల్, గోనుగుంట్ల కిరణ్, రావి సురేష్ బాబు, చిట్టిపోతు రంగారావు, రావూరి సురేష్, కోయ రామోజీరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులు హేయం

వామపక్షాలు, ముస్లిం నాయకులు, మాలమహానాడు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న గ్రామస్తులు

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో ఆదివారం రాత్రి వామపక్షాలు, ముస్లిం యూత్, మాలమహానాడు ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాలకు నిరసనగా, మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి సరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ టూరిస్టులుగా వెళ్లిన వారిని ఉగ్రవాదులు దాడిచేసి చంపడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ దాడులలో కశ్మీర్‌లో ముస్లిం కుటుంబానికి చెందిన యువకుడు కూడా మృతి చెందారని అన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దీనిని సాకుగా చూపి దేశంలో మతకల్లోలాలకు కొందరు యత్నిస్తున్నారని, ఈ ప్రయత్నాలను దేశ ప్రజలందరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హిందూ–ముస్లిం–క్రైస్తవులం మేమంతా భారతీయులం, ఉగ్రవాదులారా ఖబడ్దార్ అంటూ నినాదాలు చేశారు. మాలమహానాడు మండల నాయకులు దొప్పలపూడి దిబ్బయ్య, ముస్లిం యూత్ నాయకులు మహమ్మద్ అస్లాం, షేక్ సుభానీ, బాజీ, మీరా హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రేష్టి శ్రీనివాస శర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల అభిషేకాలు, పలు పూజా కార్యక్రమాలను జరిపించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ తోరనాలతో అలంకరించారు. ఆలయ పర్యవేక్షకులు పల్లెర్ల కోటిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరునాళ్ల వద్ద మహా అన్నదానం

దాచేపల్లి: స్థానిక శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలువుల సందర్భంగా ఆదివారం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ప్రత్యేకంగా పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారుగా 15వేల మందికిపైగా భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల ముగిసేంత వరకు అన్నదాన కార్యక్రమం ప్రతి రోజు మధ్యాహ్నం జరుగుతుందని కమిటీ సభ్యులు చెప్పారు.

ఘనంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

గురజాల రూరల్: మండల పరిధిలోని చర్లగుడిపాడులోని పోలేరమ్మ తల్లి ఆలయ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవాలయాన్ని రంగులతో తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఆంజనేయస్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక యాదవరాజుల బజారులోని సువర్చలా సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ పదో వార్షికోత్సవం ఆదివారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం విజయకుమార్ ఆధ్వర్యంలో స్వామికి ప్రాత:కాల సమయం నుంచి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పున్యాహవచనం, పంచామృత అభిషేకం, సహస్రనామార్చన జరిపించారు. మధ్యాహ్నం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పలు రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



వినుకొండ: జర్నలిస్ట్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వినుకొండ నియోజకవర్గ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్ట్ ఉప్పు మస్తాన్‌రావు 4వ వర్ధంతి సభ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ జర్నలిస్టులు, నాయకులు, అభిమానులు పాల్గొని మస్తాన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మస్తాన్‌రావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాజవరపు ప్రకాష్‌రావు, లగడపాటి వెంకట్రావు, యార్లగడ్డ ఆజాద్, గంట కోటేశ్వరరావు, దేవిశెట్టి కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శ్రీను, నాయకులు పి.వి.సురేష్‌బాబు, ఆర్. శ్రీనివాసరావు, గంధం కోటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, మల్లెల ప్రసాద్, పొట్లపాడు సాయిబాబా, అడపాల వెంకటేశ్వర్లు, కోకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఉగ్రదాడి

రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు



మాట్లాడుతున్న సుబ్బారావు, చిత్రంలో సమితి సభ్యులు

నాదెండ్ల: దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టేందుకే కశ్మీర్‌లో ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేసి అమాయకులను హతమార్చారని, ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన పర్యాటకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు పేర్కొన్నారు. సాతులూరు ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిఘా, భద్రతా వైఫల్యాల కారణంగానే అమాయక పర్యాటకులు ఉగ్రదాడిలో చనిపోయారన్నారు. మరోసారి ఇలాంటి దాడులు చోటు చేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజాన్ని విభజించటం, మతాల మధ్య సమస్యలు సృష్టించటం ఉగ్రవాదుల దాడి ముఖ్య లక్ష్యమన్నారు. ఉగ్రవాదంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు. కష్టకాలంలో దేశానికి ప్రతి పౌరుడూ అండగా నిలుస్తారన్నారు. దళిత క్రిస్టియన్లు, ఇతర మైనార్టీ వర్గాలపై జరుగుతున్న అమానుష దాడులను ఖండిస్తున్నామన్నారు. సహృదయంతో ప్రతి ఒక్కరూ మానవీయ కోణంలో ఆలోచించి సామరస్యం, సహజీవనం, లౌకికతత్వాన్ని బలపరిచే ఆలోచనలు భారతీయ సమాజానికి ఎంతో ముఖ్యమన్నారు. సమితి సభ్యులు వి.శేషులు, లాజర్, పురుషోత్తం, టి.కిరణ్, వి.చంటి, బాబు ఉన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

నాదెండ్ల: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని నాదెండ్ల శాఖా గ్రంథాలయాధికారి ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వేసవి శిబిరాలు జరుగుతాయన్నారు. చిన్నారులు వేసవి శిబిరాలకు హాజరై సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నామని ఇన్‌ఛార్జ్ గ్రంథాలయాధికారి క్రోసూరి వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. విద్యార్థులకు పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్, జీకే, ఇతర అంశాలను నేర్పిస్తారన్నారు.

శావల్యాపురం: స్థానిక గ్రంథాలయం శాఖలో నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం కానుందని గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ ఆదివారం తెలిపారు. 5 నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారుల్లో చదివే సామర్థ్యంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించటానికి వేసవి విజ్ఞాన శిబిరం ఎంతోగానో దోహదపడుతుందన్నారు.40 రోజుల పాటు శిబిరం జరుగుతుందన్నారు.

మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ అబ్బాస్ నాయకత్వంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు
- 723 మందికి వైద్యసేవలు



రిబ్బన్ కట్‌చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ

నరసరావుపేట: ప్రజలు ఉచిత మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ అన్నారు. ఆదివారం డాక్టర్ అబ్బాస్ ఆధ్వర్యంలో 'మీ కోసం ఒక రోజు' కార్యక్రమం కింద పట్టణంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌ను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఉచిత రక్తపరీక్షలు, స్కానింగ్, అదనంగా 2ఈ ఎకో, బీఎండీ, ఎన్‌సీఎస్ వంటి ప్రత్యేక పరీక్షలను కూడా అందించడం అభినందించతగ్గ విషయమన్నారు. డాక్టర్ అబ్బాస్ మాట్లాడుతూ క్యాంప్‌నకు ప్రజల నుంచి వచ్చిన స్పందన తనకు మరింత ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య క్యాంపులను నిర్వహించాలనే సంకల్పం తనకు కలిగించిందన్నారు. త్వరలో మరికొన్ని మెగా మెడికల్ క్యాంపులను రూపొందించి అమలు చేస్తామని అన్నారు. ఈ క్యాంప్‌లో రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్లు షాహిన్ సయ్యద్, జకీర్ అహ్మద్, జకీర్ హుస్సేన్, హుమా, నజియా, రెహమతుల్లా, ప్రదీప్, చెన్నారెడ్డి, నవీన్, ప్రత్యూష, గాయత్రి, జై భారత్‌రెడ్డి, సోనీ, ఇర్ఫానీ, ఫారూక్ ఖాన్, గడ్డం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని తమ విలువైన సేవలను అందజేశారు. డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, ఐఎంఏ కార్యదర్శి పాలూరి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి క్యాంపు సందర్శించి కార్యక్రమాన్ని అభినందించారు. మొత్తం 723మందికి ఆరోగ్యసేవలు పొందారు.

జీసస్.. మంచి మనసు దయచేయి!



శిబిరంలో ప్రార్థనలు చేస్తున్న కార్మికులు

తమ సమస్యలు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కొంతమంది కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. 39వ రోజు ఆదివారం వినూత్న రీతిలో వారు నిరసన వ్యక్తం చేశారు. చర్చిలకు సైతం వెళ్లకుండా సమ్మె శిబిరంలోనే మోకరిల్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ మొరను ఆలకించి, సమస్యను పరిష్కరించేలా ప్రజాప్రతినిధులు, అధికారులకు మంచి మనసు దయచేయాలని జీసస్‌ను వేడుకున్నారు. - నరసరావుపేట

పేదలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

జీఎస్‌టీ సెంట్రల్ కమిషనర్ మన్నెం రఘురామిరెడ్డి



వైద్య సేవలు నిర్వహిస్తున్న వైద్యులు, చిత్రంలో మన్నెం రాఘురామిరెడ్డి దంపతులు

పిడుగురాళ్ల: పేదలకు ఉచితంగా వైద్యం అందించటమే మన్నెం అప్పిరెడ్డి చారిట్రబుల్ ట్రస్ట్ లక్ష్యమని జీఎస్‌టీ సెంట్రల్ కమిషనర్ మన్నెం రాఘురామిరెడ్డి అన్నారు. పట్టణంలోని రసూల్ పేటలోని మన్నెం రఘురామిరెడ్డి భవనంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... తన తల్లిదండ్రులైన మన్నెం అప్పిరెడ్డి, రాజ్యలక్ష్మిల జ్ఞాపకార్థం మన్నెం అప్పిరెడ్డి చారిట్రబుల్ ట్రస్టును ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించటంతోపాటు ఉచితంగా మందులను అందించటం జరిగిందన్నారు. వైద్య శిబిరంలో సుమారు 150 మంది పేదలకు సేవలను అందించారు. శిబిరంలో నరసరావుపేటకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గజ్జన బ్రహ్మానందరెడ్డి, పిడుగురాళ్ల పట్టణంలోని అభయ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బుర్రి వెంగళరెడ్డి, ప్రముఖ వైద్యురాలు కనక దుర్గతోపాటు రాఘురామిరెడ్డి భార్య సుస్మితా రెడ్డి పాల్గొన్నారు.